రైతుల భూములు రైతులకే దక్కే విధంగా చూడాలని వినతి

ఆర్డీవో సూరజ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మామిడిపల్లి రైతులు

బడంగ్‌పేట, ఆగస్టు 27 : బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న రైతుల భూములు రైతులకు దక్కే విధంగా చర్యలు తీసుకోవాలని కందుకూరు ఆర్డీవో సూరజ్ కుమార్‌కు మంగళవారం కార్పొరేటర్లు సుక్క శివకుమార్, యాతం వపన్‌కుమార్ ఆధ్వర్యంలో రైతులకు వినతిపత్రం అందజేశారు. సర్వే నంబర్ 16,17,18లో పట్టా భూమిని ఆసరగా చేసుకొని రైతులు కబ్జాలో ఉన్న భూములను కూడా అభీష్ అగర్వాల్ కబ్జా చేస్తున్నారని వారు ఆర్డీవోకు వివరించారు. సర్వే నంబర్ 99లో ఉన్న ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్నాడని వారు ఆరోపించారు. గతంలో శంషాబాద్ ఎయిర్ పోర్టులో భూములు కోల్పోయిన రైతులు ప్రభుత్వ స్థలంలో పశువుల దొడ్లు ఏర్పాటు చేసుకుంటే వాటిని కూడా కూల్చివేశారన్నారు. రైతులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. అందుకు ఆర్డీవో స్పందిస్తు ప్రభుత్వ భూమిని సర్వే చేయిస్తామని అన్నారు. రైతులకు న్యాయం జరిగే విధంగా చూస్తామన్నారు. ప్రభుత్వ భూమిని ఎవరు కబ్జా చేసిన చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వెంకటేష్, కోట్ల జగదీశ్, పోచాలు, యాదగిరి, బాబు, శ్రీరాములు, సధానందం తదితరులు ఉన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత

న్యూ నాగోలులో అక్రమంగా నిర్మించిన భవనాన్ని కూల్చివేస్తున్న జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది

ఎల్బీనగర్, ఆగస్టు 27 : సరూర్‌నగర్ సర్కిల్‌లోని కొత్త పేట డివిజన్ న్యూ నాగోలు కాలనీలో అక్రమంగా నిర్మించిన నిర్మాణాన్ని జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు మంగళవారం కూల్చివేశారు. న్యూ నాగోలు కాలనీలో రోడ్ నంబర్ 2లో నిర్మించిన భవనంలో అదనపు ఫ్లోర్‌తో పాటుగా పెంట్ హౌజ్ నిర్మాణం చేయడంతో అధికారులు నోటీసులు జారీ చేశారు. అనంతరం మంళవారం టౌన్‌ప్లానింగ్ అధికారులు తమ సిబ్బందితో భవనంలోని అదనపు అంతస్తు పెంట్ హౌజ్‌ను కూల్చివేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అక్రమ నిర్మాణదారులపై కఠినంగా వ్యవహరిస్తామని అన్నారు.

దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే పి. సబితారెడ్డి

● మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి

బడంగ్‌పేట, ఆగస్టు 27 : దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి. సబితారెడ్డి అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం మంగళవారం దివ్యాంగులకు ఆమె ట్రై సైకిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దివ్యాంగులకు ఎప్పుడు అండగా ఉంటానని అన్నారు. దివ్యాంగుల కోసం కుమ్యూనిటీహాల్‌కు స్థలం కేటాయించి భవన నిర్మాణానికి సహకరిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం నుంచి రావలసిన రాయితీలను దివ్యాంగులకు అందే విధంగా చొరవ తీసుకుంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సిద్దాల లావణ్య, కార్పొరేటర్ అర్కల భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు అర్కల కామేశ్‌రెడ్డి, దిండు భూపేశ్‌గౌడ్, బోయపల్లి శేఖర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి ఉన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత..

మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌కు పరిధిలోని లెనిన్ నగర్‌కు చెందిన బాల్ రాజ్‌కు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ రూ.17,000 చెక్కును ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అందజేశారు. ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యం చేయించుకోలేని వారికి ముఖ్య మంత్రి సహాయ నిధి ఎంతో దోహదపడుతుందనిఅన్నారు. తనకు కష్ట కాలంలో సీఎం రిలీఫ్ ఫండ్ రావడానికి కృషి చేసిన ఎమ్మెల్యే సబితారెడ్డికి, కార్పొరేటర్ సౌందర్య గారికి కృతజ్ఞతలు తెలిపారు.

అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాలు..

ఆర్కేపురం : సరూర్‌నగర్ డివిజన్ పంజాల అనిల్ కుమార్ కాలనీలో శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయ తృతీయ వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి వార్షికోత్సవాల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పండితులు, ఆలయ కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. శ్రీ అభయాంజనేయ స్వామి వార్షికోత్సవాల్లో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని, స్వామివారి ఆశీస్సులతో ప్రజలందరు బాగుండాలని వేడుకున్నట్లు ఆమె తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సరూర్‌నగర్ డివిజన్ బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు ఇంటూరి అంకిరెడ్డి, నియోజకవర్గ యూత్‌వింగ్ మాజీ అధ్యక్షుడు లోకసాని కొండల్‌రెడ్డి, నియోజకవర్గ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ, మాజీ అధ్యక్షులు ఆకుల అరవింద్ కుమార్, నాయకులు ఎం.ఏ.సాజీద్, రిషి, పోలే సుధామ, ప్రత్యూష్, రమేశ్ కురుమ, సుశీలారెడ్డి, కాలనీ వాసులు తదితరులు ఉన్నారు.

అభయాంజనేయస్వామి వార్షికోత్సవ పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సబితారెడ్డి

కుట్రలతో కేసీఆర్‌ను భయపెట్టలేరు

కవితకు బెయిల్ రావడంతో ఆర్కేపురంలో సంబురాలు జరుపుకుంటున్న బీఆర్ఎస్ శ్రేణులు

ఆర్కేపురం, ఆగస్టు 27 : బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఎన్ని కుట్రలు చేసిన కేసీఆర్‌ను భయపెట్టలేరని మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ అన్నారు. మంగళవారం ఎమ్మెల్సీ కవితకు బెయిల్ రావడంతో ఆర్కేపురం గ్రీన్‌హిల్స్ కాలనీలో స్వీట్లు పంచి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొదటి నుంచే కేసీఆర్ ఇది మోసపూరితమైన కేసు అని అన్నారని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆడుతున్న రాజకీయ డ్రామాతప్పితే ఈ కేసులో పసలేదన్నారు. సుప్రీం కోర్టు వాదోప వాదనలు విన్నతరువాత కేసీఆర్ అన్నవిధంగానే కవిత కడిగిన మూత్యంలాగా వచ్చిందన్నారు. మహిళ అని చూడకుండా ఆరోగ్యం బాగాలేకపోయినప్పటికీ అయిదు నెలలు ఇబ్బంది పెట్టారని తెలిపారు. చివరకు న్యాయం గెలిచిందన్నారు. తప్పుడు కేసులు ఎప్పటికీ నిలవవని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేశ్, గొడుగు శ్రీనివాస్, ఎం.ఏ. సాజీద్, కొండ్ర శ్రీనివాస్, శ్రీమన్నారాయణ, శ్యామ్‌గుప్తా, మహేందర్‌రెడ్డి, సిద్దగోని వెంకటేష్‌గౌడ్, పెంబర్తి శ్రీనివాస్, జగన్, దీపక్, మురళీధర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అవయవ దాతలను సన్మానించుకుందాం

అవయవదాతలను సన్మానించడం గురించి వివరిస్తున్న చల్ల రాంకల్యాణ్

ఆర్కేపురం, ఆగస్టు 27 : తెలంగాణ రాష్ట్రంలో మరణించిన అవయవదాతలను సన్మానించేందుకు కంటి, అవయవం, శరీర దాన ప్రోత్సాహక సంస్థల సంయుక్త కూటమి (జేఏసీ) మంగళవారం ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి బి ద చేంజ్ ఆర్గనైజేషన్ ఫౌండర్ చల్ల రాంకల్యాణ్ ప్రతిపాదనను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవయవదానం చేసే వారి త్యాగాన్ని గుర్తించి దాత కుటుంబానికి మద్దతు అందించడానికి ఈ పథకం కీలకంగా మారుతుందన్నారు. సమన్వయం, తక్షణ నోటిఫికేషన్, అవయవాలను సేకరించడం, మరణించిన దాతలను సన్మానించడానికి ఆస్పత్రులు, జిల్లా అధికారుల సమన్వయం సాధించడం, ఆర్థిక సహాయం, రవాణా సౌకర్యాలు అందించడం, దాతల త్యాగాన్ని గుర్తిస్తూ వారి ఫొటోతో సహా వివరణాత్మక ప్రెస్ రిలీజ్ జారీ చేయడం జరుగుతుందన్నారు. బి ద చేంజ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో అవయవదానం కార్యక్రమం ఆన్ వీల్స్ కార్యక్రమాన్ని ప్రశంసించారని తెలిపారు. దామోదర రాజనర్సింహను కలిసిన వారిలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, రావినూతల రమాకాంత్ తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఎల్బీనగర్ జోనల్ కార్యాలయంలో దోమల నివారణపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్

ఎల్బీనగర్, ఆగస్టు 27 : దోమల నివారణతో పాటు వాటి ద్వారా వ్యాపించే సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ అన్నారు. మంగళవారం ఎల్బీనగర్ జోనల్ కార్యాలయంలో ఐదు సర్కిళ్ల అధికారులతో దోమల నివారణ, వాటి ద్వారా వ్యాపించే సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న జోనల్ కమిషనర్ మాట్లాడుతూ.. దోమలను నిర్మూలించాలని, వాటి ద్వారా వ్యాపించే మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, బోధకాలు వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. అన్ని సర్కిళ్లలో దోమల నివారణపై కార్యమాలను చేపట్టడంతో పాటుగా దోమల అవాసాలు లేకుండా చూసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దృష్టి సారించాలని తెలిపారు. పారిశుధ్య పనుల విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. సీనియర్ ఎంటమాలజిస్ట్ రజిని , ఐదు సర్కిళ్ల ఏఎంఓహెచ్‌లు, డీఈ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

సంతోష్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రక్షాపురం దేవాలయంలో అమ్మవారి విగ్రహాలను ఇద్దరు వ్యక్తులు సోమవారం రాత్రి ధ్వసం చేసినట్లు స్థానికులు తెలిపారు. మంగళవారం ఉదయం బీజేపీ నాయకులు, హిందూ సంఘాల నాయకులు, స్థానికులు కలిసి దేవాలయం వద్ద ధర్నా చేశారు. సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ కాంతిలాల్ పాటిల్ ఘటనా స్థలానికి చేరకొని ఈ సంఘటనలో పాల్గొన్న ఇద్దరిని అదుపులో తీసుకున్నామని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, అలాగే ఆర్డీఓ, తాసీల్దార్‌లతో మాట్లాడి విగ్రహ ప్రతిస్థాపన చేయిస్తామని హామీ ఆవ్వడంతో నాయకులు ధర్నా విరమించారు. జాతీయా కౌన్సిల్ సభ్యులు సహదేవ్ యాదవ్, మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్, భాగ్యనగర్ అధ్యక్షుడు సమ్మరెడ్డి, వీరేందర్‌బాబు, కార్పొరేటర్లు లక్ష్మి, కొత్త కాపు అరుణారెడ్డి, నాయకులు ఆలె జితేందర్ పాల్గొన్నారు.

– మాదన్నపేట , ఆగస్టు 27

సామూహిక కుంకుమార్చన

మన్సూరాబాద్, ఆగస్టు 27: శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని మన్సూరాబాద్ డివిజన్ పరిధి సీఆర్ ఎన్‌క్లేవ్‌లోని పోచమ్మ దేవాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు పెద్ద ఎత్తున హాజరై గౌరీ వ్రతంతో పాటు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన భక్తుల కోసం మన్సూరాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్, ఆలయ కమిటీ చైర్మన్ కొప్పుల విఠల్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లను చేశారు. ఈ సందర్భంగా కొప్పుల విఠల్‌రెడ్డి మాట్లాడుతూ.. స్వయంభూ పోచమ్మ దేవాలయ అభివృద్ధి కోసం భక్తులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ వైస్ చైర్మన్ పోచబోయిన గణేశ్‌యాదవ్, సభ్యులు బొడిగె యాదయ్య, నాంపల్లి కృష్ణ, ఈశ్వర్, అర్చకులు శ్రీధరాచార్యులు పాల్గొన్నారు.

సీఆర్ ఎన్‌క్లేవ్‌లోని పోచమ్మ దేవాలయంలో నిర్వహించిన సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు, ఆలయ కమిటీ చైర్మన్ కొప్పుల విఠల్‌రెడ్డి తదితరులు

నర్సుపై.. డాక్టర్ అత్యాచార యత్నం

కందుకూరు, ఆగస్టు 27 : ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న నర్సుపై అందులో పని చేస్తున్న డాక్టర్ అత్యాచార యత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. కందుకూరు మండల పరిధిలోని హైదరాబాద్–శ్రీశైలం రహదారి పక్కల గూడూరు గేటు వద్ద ఇటీవల నూతనంగా ఏర్పాటు చేసిన లిమ్స్ ప్రైవేట్ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న నర్సు తన ఇంటికి హైదరాబాద్ వెల్లడానికి బస్సు స్టాపులో ఉండగా అదే ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ మార్కండేయ తన కారులో హైదరాబాద్‌కు వెళ్తా తనతో రావాల్సిందిగా నర్సును కోరడంతో ఆమె డాక్టర్ కారులో ఎక్కింది పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల తుక్కుగూడ వద్దకు రాగానే ఆమెపై అత్యచారం యత్నం చేయడానికి డాక్టర్ ప్రయత్నించడంతో నర్సు అందుకు అంగీకరించక కారులో నుంచి దిగడానికి ప్రయత్నించింది. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు పహాడీషరీఫ్ పోలీసులు డాక్టర్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సెప్టెంబర్ 17న విశ్వకర్మ జయంతి మహోత్సవాలు

మన్సూరాబాద్, ఆగస్టు 27: రంగారెడ్డి జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం సౌజన్యంతో సెప్టెంబర్ 17న ఎల్బీనగర్‌లోని ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం ప్రాంగణంలోని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో శ్రీవిరాట్ విశ్వకర్మ జయంతి యజ్ఞ మహోత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు విశ్వబ్రాహ్మణ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పులిగిల్ల శ్రీనివాసచారి తెలిపారు. విశ్వకర్మ భగవాన్ యజ్ఞ కమిటీ అధ్యక్షుడు మల్లోజు నరేశ్‌చారి, ప్రధానకార్యదర్శి నారోజు కొండలాచారి, కోశాధికారి చెన్నోజు సింహాద్రి చారి, ప్రచార కార్యదర్శులు పసునూరి నర్సింహాచారి, దేవరకొండ షణ్ముఖచారి పర్యవేక్షణలో ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఎల్బీనగర్‌లోని ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం ప్రాంగణంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు పులిగిల్ల శ్రీనివాసచారి హాజరై సెప్టెంబర్ 17న నిర్వహించనున్న శ్రీవిరాట్ విశ్వకర్మ జయంతి యజ్ఞ మహోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ ఫౌండర్ ట్రస్ట్ చైర్మన్ గుంటి లక్ష్మణ్, ఈఓ వి. ప్రేమ్‌కుమార్ రావు, సంఘం సభ్యులు అందోజు దయానంద్ చారి, సత్యంచారి, నారోజు జగ్జీవన్‌చారి, పగిడోజు వెంకటేశ్వరాచారి, ఎల్బీనగర్ విశ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పర్వతం శ్రీనివాసచారి పాల్గొన్నారు.

అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న కేఎల్ఆర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎ. శంకర్‌రెడ్డి

బడంగ్‌పేట, ఆగస్టు 27: మహేశ్వరం నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి రియల్ ఎస్టేట్ పేరుతో భూదందాలు చేస్తూ రాజ్యాంగేతర శక్తిగా మారాడని బీజేపీ నేత ఎ. శంకర్‌రెడ్డి ఆరోపించారు. జిల్లెలగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యక్రమాలకు ఆటంకం కల్పిస్తున్నారని చెప్పారు. అధికారులు ఏకపక్షంగా వ్యవహరించే విధంగా ప్రోత్సహిస్తున్నాడని, తీరు మారకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని అన్నారు. బీజేపీ నేతలు కే సోమేశ్వర్, గాజుల మధు, శ్యామ్‌రాజ్ తదితరులు ఉన్నారు.

పెండింగ్ పనులను సత్వరమే పూర్తిచేయాలి

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బలాల

సైదాబాద్, ఆగస్టు 27 : నియోజకవర్గం పరిధిలోని అపరిష్కృత సమస్యల పరిష్కారానికి అధికారులు తగు చర్యలు తీసుకోవాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అధికారులను అదేశించారు. మంగళవారం తన కార్యాలయంలో జరిగిన వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్ పనులను వేగవంతం చేయాలని, కొత్త పనులకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, పనుల్లో జాప్యంలేకుండా చూడాలని, నాణ్యత ప్రమాణాలను పాటించే దిశగా తగు చర్యలు తీసుకోవాలన్నారు. డివిజన్ల పరిధిలో నెలకొన్న సమస్యలను ఆయా డివిజన్ల కార్పొరేటర్లను అడిగి తెలుసుకున్నారు. అక్బర్‌బాగ్, సైదాబాద్ డివిజన్ల పరిధిలోని సపోటాబాగ్, మాదవనగర్, నల్గొండ చౌరస్తాల్లో కొనసాగుతున్న డ్రైనేజీ ఆధునీకరణ పనులను ఎమ్మెల్యే పరిశీలించి ప్రజలకు మురుగునీటి ఇబ్బందులు లేకుండా పైప్‌లైన్ ఆధునీకరణ పనులను వేగవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అక్బర్‌బాగ్, అజంపురా డివిజన్ల కార్పొరేటర్లు మినాజుద్దీన్, అబ్రార్, జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు పాల్గొన్నారు.

బాలికతో అసభ్య ప్రవర్తన.. యువకుడికి జైలుశిక్ష

రంగారెడ్డి జిల్లా కోర్టులు,ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించిన భాను ప్రకాశ్(20)కు ఏడాది జైలుశిక్షతో పాటు పదివేల జరిమానా విధిస్తూ.. బాధిత బాలికకు రూ. లక్ష పరిహారం అందించాలని ఆదేశిస్తూ రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టు తీర్పునిచ్చింది. పీపీ సునీత కథనం ప్రకా రం.. జల్‌పల్లి, శ్రీరాంకాలనీకి చెందిన బాలిక స్థానిక పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. అదే కాలనీకి చెందిన నిందితుడు భాను ప్రకాశ్ 2019 మార్చి 26న పాఠశాలకు వెళ్తున్న బాలికను అడ్డగించి బెదిరించగా బాలిక తన తల్లిదండ్రులకు తెలిపింది. పహాడీషరీఫ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి కోర్టులో చార్జీషీట్ దాఖలు చేయగా సాక్షాధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితునికి శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది.

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

కరాటే కుంగ్‌ఫూ ఛాంపియన్‌షిప్‌లో పథకాలు సాధించిన విద్యార్థులతో ఇస్తియాక్‌గుల్షన్

ఆర్కేపురం, ఆగస్టు 27 : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని లయోలా పాఠశాల డైరెక్టర్ మహమ్మద్ ఇస్తియాక్ గుల్షన్ అన్నారు. ఎల్బీస్టేడియంలో నిర్వహించిన 35వ జాతీయస్థాయి కరాటే కుంగ్‌ఫూ ఛాంపియన్‌షిప్ 2024 పోటీల్లో సరూర్‌నగర్ డివిజన్‌లోని లయోలపాఠశాల విద్యార్థులు పది మంది బంగారు పథకాలు సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన విద్యార్థులను అభినందించారు. తమ పాఠశాలలో చదివే విద్యార్థులను క్రీడారంగంలో ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. రానున్న రోజుల్లో క్రీడల్లో మరిన్ని పథకాలు సాధించేందుకు కృషి చేస్తామని చెప్పారు. వైస్ ప్రిన్సిపల్ కోడటి హర్షిత, అకడమిక్ ఇన్‌చార్జి ఉదయరాణి, కరాటే మాస్టర్ మారేగౌని నరేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

కార్పొరేటర్‌కు అభినందనలు

చంపాపేట, ఆగస్టు 27 : లింగోజిగూడ డివిజన్ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డికి ఎల్బీనగర్ పరిధిలోని పలు ప్రాంతాల పేదల నుంచి అభినందనలు వెల్లు వెత్తాయి. రాష్ట్రంలో అంగబలం, ఆస్తిబలం ఉండి తమనెవ్వరు అడ్డుకోరని, చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టిన బహుళ అంతస్తుల మేడలను కూల్చి ప్రభుత్వ భూములను కాపాడేందుకు ఇటీవ ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా చేపడుతున్న కూల్చివేతలతో తమ ఇండ్లను కూల్చి తమను నిరాశ్రయులను చేస్తారేమోనని దిగులు చెందుతున్న పేదలకు అండగా తానున్నానని పేదల ఇండ్లను కూల్చి వారికి అన్యాయం చేయొద్దని కార్పొరేటర్ ధర్పల్లి రాజశేఖర్‌రెడ్డి హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కలిసి వినతి పత్రం అందజేసినందుకుగాను పేదలు మంగళవారం లింగోజిగూడ డివిజన్ పరిధిలోని తపోవన్ కాలనీ, గ్రీన్‌పార్క్ కాలనీ, సింగరేణి కాలనీల సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో కార్పొరేటర్ ధర్పల్లి రాజశేఖర్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. కాలనీ మాజీ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, ఐలయ్య, ప్రసాద్, ఉపాధ్యక్షుడు మహేశ్‌కుమార్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

వివిధ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 27: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ – మెకానికల్, బీఎస్సీ ఏవియేషన్ కోర్సుల మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును వచ్చే నెల 3వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.500 అపరాధ రుసుముతో 6వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను అక్టోబర్ నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osm ania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

వివిధ కోర్సుల ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 27: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్ఏ (సీబీసీఎస్) కోర్సు పరీక్షా ఫలితాలతో పాటు అన్ని విభాగాల బీఈ (సీబీసీఎస్) రివాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www. osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

ఎమ్మెస్సీ మాలిక్యులర్ జెనిటిక్స్ పరీక్షా తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 27: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎమ్మెస్సీ మాలిక్యులర్ అండ్ హ్యూమన్ జెనిటిక్స్ పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు నాలుగో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈ నెల 31వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania .ac.in లో చూసుకోవచ్చని సూచించారు.

ఎంసీఏ పరీక్షా తేదీల మార్పు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 27: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంసీఏ పరీక్షా తేదీలను మార్చినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంసీఏ (సీబీసీఎస్) (రెండేళ్ల కోర్సు) రెండు, నాలుగో సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈ నెల 30వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించామని చెప్పారు. అదే రోజు పరీక్షలు ప్రారంభమవుతున్నప్పటికీ, ఇతర పరీక్షా తేదీలను మార్చినట్లు చెప్పారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను

ఓయూ వెబ్‌సైట్ www.osmania. ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

PUBLIC NOTICE

The General Public are informed that my client Smt. K. Satyamani W/o. Late K Chinna Rajanna aged: 62 Occ: Household, Ro. H.No.2-3-425/1, Lalithanagar, Road No.2, Nagole, Hyderabad-500068, T.S, has lost misplaced the original link documents in respect of Plot No. 6, in Sy. No. 97,98,99, 100 situated at Nagole, Hyderabad admeasuring 375 Syds, as noted hereunder. 1) Sale deed doc.No.807/1980 dated 25-01 1980 registered on the file of SRO Hyderabad East. 2) Sale deed doc.No.3501/1980 dated 01-04-1980 Registered on the file of SRO, Hyderabad East 3) Original GPA doc No. 117/1985 of book 4 dated 27-09-1985, Registered on the file of District Registrar, Vishakapatnam. 4) Original sale deed doc No.7004/1985 dated 08-10-1985 Registered on the file of District Registrar, R.R, Dist.

They were not traced out inspite of best efforts put in by my client and they are lost misplaced beyond recovery.

If any person traces them he may contact the undersigned within 7 days from this notice failing which it may be treated as there are no encumbrances on the said property. If any transaction is made with the person possessing the lost documents, such deal will be void, illegal and my client shall not be